క్లుప్తంగా

ఎల్‌ఓసీ అందజేత



వేలేరు : మండల కేంద్రానికి చెందిన బిల్లా రాధ కిడ్నీ, లివర్ సమస్యతో బాధపడుతూ హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. కాగా మాజీ సర్పంచ్ మల్లికార్జున్ ద్వారా విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి వెంటనే స్పందించి రూ.2.30 లక్షలు సీఎం సహాయ నిధి నుంచి ఎల్‌ఓసీ మంజూరు చేయించారు. ఈ మేరకు ఎల్‌ఓసీ పత్రాన్ని ఎమ్మెల్యే కడియం శనివారం బాధిత కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో మల్లికుదుర్ల మాజీ సర్పంచ్ గొడెల రాజిరెడ్డి, విజయలక్ష్మి, అరుణ తదితరులు పాల్గొన్నారు.

పొదుపు సంఘం సామూహిక నిధి..



శాయంపేట : మండలంలోని వసంతాపూర్ గ్రామంలోని బాపూజీ పురుషుల పొదుపు సంఘం సభ్యుడు అంకూష్ అనారోగ్యంతో ఇటీవల మృతిచెందాడు. కాగా సంఘం నుంచి మంజూరైన సామూహిక నిధి రూ.60వేల నగదును అంకూష్ కుటుంబ సభ్యులకు శనివారం సమితి అధ్యక్షుడు ఎండీ.ఉస్మాన్ అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు ప్రేమ్‌సాగర్, పాలకవర్గ సభ్యులు మల్లాజి, పాపారావు, బాపురావు, విద్యాసాగర్, అమరేందర్, విజయ్‌రావు, రాజేశ్వర్, లింగమూర్తి, సతీష్ పాల్గొన్నారు.

క్రమశిక్షణతో మెలగాలి

● సోషల్ వెల్ఫేర్‌లో కౌన్సిల్ ఫలితాలు



శాయంపేట : మండల కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల /కళాశాలలో ఈ నెల 3న కౌన్సిల్ లీడర్స్, స్కూల్ లీడర్స్ ఎంపికకు ఎన్నికలు నిర్వహించారు. కాగా శనివారం ఎన్నికల కౌంటింగ్ నిర్వహించి ఎన్నుకున్నట్లు ప్రిన్సిపాల్ సుభాషిణి దేవి తెలిపారు. తోటి విద్యార్థులను క్రమశిక్షణ భావంతో మెదిలేలా చూడాలని సూచించారు. స్కూల్ కెప్టెన్‌గా ఎం.వర్ష ఇంటర్ బైపీసీ ద్వితీయ సంవత్సరం, వైస్ కెప్టెన్‌గా ఎండీ సమీరా, సాంస్కృతిక కెప్టెన్ ఎం.మహాలక్ష్మి, స్పోర్ట్స్ కెప్టెన్ జె.సిరి, లిటరరీ కెప్టెన్ ఎ.హర్షిత ఎన్నికయ్యారు. లీడర్స్‌ను ప్రిన్సిపాల్ సుభాషిణి దేవి, ఉపాధ్యాయులు అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

ఓఆర్‌ఎస్ తయారీపై అవగాహన



నడికూడ : మండలంలోని ముస్త్యాలపల్లి గ్రామంలో శనివారం ఏఎన్‌ఎం విజయలక్ష్మి ఆధ్వర్యంలో ఓఆర్‌ఎస్ తయారీపై పిల్లల తల్లులకు అవగాహన కల్పించారు. అనంతరం విజయలక్ష్మి మాట్లాడుతూ వర్షాకాలంలో చిన్న పిల్లలకు డయేరియా, వాంతులు, విరోచనాలు, తగినంత నీరు తాగలేకపోవడం వల్ల డీహైడ్రేషన్ సమస్య వస్తే ఓఆర్‌ఎస్, జింక్ టాబ్లెట్లతో చేసిన ద్రావణం ఎంతో ఉపయోకరంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఆశ వర్కర్ సునీత, అంగన్‌వాడీ టీచర్, తల్లులు తదితరులు పాల్గొన్నారు.

స్పెషలాఫీసర్‌గా మధురిమ

శాయంపేట : మండల ప్రత్యేక అధికారిగా జిల్లా సంక్షేమ అధికారి మధురిమను నియమించినట్లు ఉత్తర్వులు జారీ చేసినట్లు ఎంపీడీఓ ఫణిచంద్ర శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నూతన ఎంపీపీ, వైస్ ఎంపీపీ పదవి స్వీకరించే వరకూ మధురిమ మండల ప్రత్యేక అధికారిగా విధులు నిర్వహిస్తారని తెలిపారు.

పరకాల మండల ప్రత్యేక అధికారిగా వెంకటనారాయణ



పరకాల : మండల పరిషత్ ప్రత్యేక అధికారిగా వెంకటనారాయణ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఎంపీపీల పదవీకాలం ముగియడంతో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు వెంకటనారాయణ పరకాల మండల పరిషత్ ప్రత్యేక అధికారిగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ ఆంజనేయులు, కార్యాలయ సూపరింటెండెంట్ శైలశ్రీ, ఏపీఓ ఇందిర, కార్యాలయ సిబ్బంది వెంకటనారాయణను మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. అనంతరం కార్యాలయం ఆవరణంలో వన మహోత్సవం కార్యక్రమాన్ని వెంకటనారాయణ ప్రారంభించారు.

నిధులు లేవు.. పనులు కావు

● నత్తనడకన సబ్ మార్కెట్ యార్డు నిర్మాణం
● నిర్మాణం పూర్తయితే తగ్గనున్న దూరం
● తప్పనున్న దళారుల బెడద



మార్కెట్ యార్డులో నిర్మించిన షెడ్లు

వేలేరు : మండలంతో పాటు చుట్టూ పక్కల గ్రామాలు, ఇతర మండలాల రైతులు పండించిన పంట ఉత్పత్తులను విక్రయించేందుకు వరంగల్ ఏనుమాముల మార్కెట్‌కు తీసుకెళ్లే పరిస్థితి. దీంతో రైతులు పంటకు గిట్టుబాటు ధర రాకపోవడంతో పాటు, దూర ప్రాంతాలకు వెళ్లి విక్రయిస్తే ఆర్థిక భారంతో అప్పులు తప్ప పైసా మిగిలే పరిస్థితి లేదు. ఇక్కడి రైతులు పడుతున్న ఇబ్బందులు గ్రహించిన అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఏనుమాముల మార్కెట్‌కు అనుసంధానంగా రైతుల సౌకర్యార్థం 5 ఎకరాల స్థలంలో సబ్ మార్కెట్ యార్డు నిర్మాణానికి 2022 ఏప్రిల్‌లో రూ.1.98 లక్షల నిధులతో అప్పటి ఎమ్మెల్యే రాజయ్య, ప్రస్తుత జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. సంబంధిత కాంట్రాక్టర్‌కు గడువులోగా పనులు పూర్తి చేసి రైతులకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. అయితే నిర్మాణ పనులు ప్రారంభించిన కాంట్రాక్టర్లు మార్కెట్ చుట్టూ ప్రహరీ నిర్మించారు. లోపల రెండు షెడ్లు, ఆఫీస్ రూం, మరుగుదొడ్ల నిర్మాణ పనులు ఇప్పటి వరకు పూర్తి చేయలేదు. పనులు ఎప్పటిలోగా పూర్తి చేస్తారని సంబంధిత కాంట్రాక్టర్‌కు ఫోన్ చేయగా చేసిన పనులకే బిల్లులు రాలేదని బిల్లులు రాగానే పనులు పూర్తి చేసి సబ్ మార్కెట్ యార్డును రైతులకు అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు. పనుల పురోగతిపై సంబంధిత శాఖ ఏఈకి ఫోన్ చేయగా అందుబాటులోకి రాలేదు.

పనులు త్వరగా పూర్తి చేయాలి



మండలంలోని సోడాషపల్లి శివారులో నిర్మిస్తున్న సబ్ మార్కెట్ యార్డు పనులను త్వరగా పూర్తి చేసి రైతులకు అందుబాటులోకి తీసుకు రావాలి. రైతులు పండించిన పంటలను వరంగల్ మార్కెట్‌కు తీసుకెళ్తే రవాణా ఖర్చులు అధికమై అప్పులే మిగులుతున్నాయి. ప్రభుత్వం, స్థానిక ఎమ్మెల్యే చొరవ చూపి సబ్ మార్కెట్ యార్డు పనులు పూర్తి చేసి త్వరగా అందుబాటులోకి తీసుకురావాలి

– జల్తారి రవి, రైతు, పీచర

దళారుల బెడద తప్పనుంది



సబ్ మార్కెట్ యార్డు నిర్మాణం పూర్తయితే రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర దక్కడంతోపాటు దళారుల బెడద తప్పనుంది. సకాలంలో పంటను విక్రయించుకునే అవకాశం ఉంటుంది. అలాగే దూర ప్రాంతాల్లోని మార్కెట్లకు వెళ్లలేక పండించిన పంటలను దళారులకు అమ్ముకోవాల్సిన బాధ తప్పనుంది.

– ఈదబోయిన సందీప్, రైతు

‘అమ్మపేరుతో మొక్క నాటాలి’



ఆత్మకూరు: మొక్కలు నాటుతున్న విజయచందర్‌రెడ్డి, కాళీప్రసాదరావు



శాయంపేట: ముఖర్జీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

ఆత్మకూరు : అమ్మపేరుతో మొక్క నాటాలని బీజేపీ నియోజకవర్గ నాయకులు డాక్టర్ పెసరు విజయ్‌చందర్‌రెడ్డి, డాక్టర్ పగడాల కాళీప్రసాదరావు అన్నారు. మండలకేంద్రంలో శనివారం డాక్టర్ శ్యామప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివస్ సందర్భంగా మోదీ ప్రారంభించిన ‘ఏక్‌పేడ్ మాకే నామ్’ అనే కార్యక్రమంలో భాగంగా బీజేపీ నాయకులు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్యామప్రసాద్ ముఖర్జీ సేవలను కొనియాడారు. అలాగే మండలకేంద్రంలో ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన జాగిలపు విజయ, అక్కంపేటకు చెందిన కందకట్ల లక్ష్మి అనారోగ్యంతో మృతిచెందగా బాధిత కుటుంబాలను పరామర్శించి ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ముత్యాల శ్రీనివాస్‌గౌడ్, మండల అధ్యక్ష, కార్యదర్శులు బలవంతుల రాజు, ఉప్పుగల్ల శ్రీకాంత్‌రెడ్డి, మండల మాజీ అధ్యక్షుడు ఇర్సడ్ల సదానందం, కిసాన్‌మోర్చా నియోజకవర్గ కోకన్వీనర్ వంగాల బుచ్చిరెడ్డి, నాయకులు శ్రావణ్‌కుమార్, బయ్య పైడి, రేమిడి మల్లారెడ్డితో పాటు తదితరులు పాల్గొన్నారు.

శ్యామప్రసాద్ ముఖర్జీ జయంతి

శాయంపేట : మండల కేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్లో శనివారం భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్యామప్రసాద్ ముఖర్జీ జయంతి వేడుకలను బీజేపీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి నరహరిశెట్టి రామకృష్ణ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ భారత దేశం ఐక్యత కోసం, సమగ్రత కోసం తన జీవితాన్ని అంకితం చేసిన ఆదర్శ వ్యక్తి డాక్టర్ శ్యామప్రసాద్ ముఖర్జీ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఉప్పు రాజు, బసాని విద్యాసాగర్, వనం దేవరాజు, కోమటి శేఖర్, కానుగుల నాగరాజు, కొత్తపల్లి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

11నుంచి ఈజీఎస్ సామాజిక తనిఖీ



మాట్లాడుతున్న ఎస్‌ఆర్పీ కొమురయ్య

దామెర : ఈ నెల 11వ తేదీ నుంచి జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం పనులపై సామాజిక తనిఖీలు నిర్వహించనున్నట్లు ఏపీఓ శారద తెలిపారు. ఈ మేరకు మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం సమన్వయ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏపీఓ మాట్లాడుతూ సామాజిక తనిఖీల్లో భాగంగా 12 మంది డీఆర్పీలు మండలానికి చేరుకున్నట్లు తెలిపారు. తనిఖీ బృందానికి రికార్డులు అప్పగించినట్లు చెప్పారు. ఎస్‌ఆర్పీ కొమురయ్య మాట్లాడుతూ..ఈ నెల 11వ తేదీ నుంచి ప్రతి గ్రామంలో తనిఖీ నిర్వహించిన తర్వాత 15న మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఓపెన్ ఫోరం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. సమావేశంలో డీఆర్పీలు, పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వాటర్ ట్యాంక్ నిర్మాణం

కమలాపూర్ : మండల కేంద్రంలోని శ్మశాన వాటికలో శిథిలమై కూలిపోయిన మినీ వాటర్ ట్యాంక్‌ను ఎర్రగొల్ల అశోక్ స్మారకార్థం కుటుంబ సభ్యులు పునర్ నిర్మించినట్లు యువ యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు మండ అశోక్, ఉపాధ్యక్షుడు చిలుక రాజేందర్ తెలిపారు. సుమారు 15 ఏళ్ల క్రితం యువ యూత్ సభ్యుడు అశోక్ మృతి చెందగా స్నేహితుడి జ్ఞాపకార్థం యూత్ సభ్యులు తలా కొంత జమ చేసి శ్మశాన వాటిక వద్ద మినీ వాటర్ ట్యాంకు నిర్మించగా, ఇటీవల ఆ మినీ వాటర్ ట్యాంకు పూర్తిగా శిథిలమై కూలిపోయింది. ఈ విషయాన్ని అశోక్ కుటుంబ సభ్యుల దృష్టికి తీసుకెళ్లగా వారు మినీ వాటర్ ట్యాంకు నిర్మాణానికి ముందుకొచ్చి సుమారు రూ.25 వేల వ్యయంతో నిర్మించినట్లు తెలిపారు. శ్మశానవాటికలో మినీ వాటర్ ట్యాంకు నిర్మించిన అశోక్ కుటుంబ సభ్యులకు యూత్ అసోసియేషన్ తరపున వారు కృతజ్ఞతలు తెలిపారు.

పంట ఉత్పత్తులు మార్కెట్‌కు రావాలి

పరకాల : రైతులు తీసుకువచ్చే ప్రతి పంట ఉత్పత్తి నేరుగా మార్కెట్‌కు వచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఏఐటీయూసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ధర్మల రాంమూర్తి, జిల్లా నాయకుడు ఇల్లందుల రాములు డిమాండ్ చేశారు. పరకాల వ్యవసాయ మార్కెట్ యార్డులో శనివారం ఏఐటీయూసీ అనుబంధ వ్యవసాయ మార్కెట్ హమాలీ, దడువాయిల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రాంమూర్తి, రాములు మాట్లాడుతూ ప్రైవేట్ మిల్లుల వల్ల మార్కెట్‌లో కార్మికులకు ఉపాధి కరువు అవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. అదే విధంగా మార్కెట్ హమాలీ కార్మికుల కోసం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు.

పరకాల ఏఐటీయూసీ కమిటీ ఎన్నిక

పరకాల ఏఐటీయూసీ అనుబంధ పరకాల వ్యవసాయ మార్కెట్ హమాలీ కార్మికుల నూతన కమిటీ గౌరవ అధ్యక్షుడిగా కూతురు ప్రతాప్‌రెడ్డి, ఇల్లందుల రాములు, అధ్యక్షుడిగా లంకదాసరి అశోక్, ఉపాధ్యక్షుడిగా బి.యాదగిరి, ఎం.రాజేశ్వరి, ప్రధాన కార్యదర్శిగా ఎస్.శంకర్, సహాయ కార్యదర్శులుగా ఎస్.తిరుపతి, ధర్మం, సుధాకర్, పి.సాంబయ్య, ఓ.శంకర్‌తో పాటు కోశాధికారిగా శ్రీపతి రాజు, కమిటీ సభ్యులుగా లాలుప్రసాద్, కె.కుమార్, జె.ఐలయ్య, ఎస్.సాంబయ్య, జె.పాపయ్య, సీహెచ్ రాజయ్య, ఎస్.రాజు,సీహెచ్.ఎల్లయ్య, సుందరమ్మను ఎన్నుకున్నారు.

బలహీనవర్గాల ఆశాజ్యోతి జగ్జీవన్‌రామ్



దామెర: పులకుర్తిలో జగ్జీవన్‌రామ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు



ధర్మసాగర్: నివాళులర్పిస్తున్న శ్రీనివాస్



ఎల్కతుర్తి: జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

ధర్మసాగర్ : డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్ ఆశయాలను ప్రతి ఒక్కరూ కొనసాగించాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు గంగారపు శ్రీనివాస్ అన్నారు. ఈ మేరకు మండల కేంద్రంలోని ఎస్సీ కమ్యూనిటీ హాల్ ఎదుట శనివారం జగ్జీవన్ రామ్ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం శ్రీనివాస్ మాట్లాడుతూ దేశ సమగ్రతకు, జాతి ఐక్యతకు కృషి చేసి, భారత రాజ్యాంగానికి కాపలాదారుడుగా వ్యవహరించిన మహనీయుడు జగ్జీవన్ రామ్ ఆశయాలను కొనసాగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు పుట్ట దేవరాజ్, కొట్టె శంకర్, జి.శ్రీనివాస్, కె.రవి, మునిగాల కరియప్ప, రాహుల్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

బాబూ జగ్జీవన్‌రామ్ వర్ధంతి

ఎల్కతుర్తి : మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్ రామ్ వర్ధంతిని శనివారం భీమదేవరపల్లి మండలంలోని ముల్కనూర్‌లో గల అంబేడ్కర్ చౌక్ వద్ద పలు సంఘాల నాయకులు ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ 1952లో జరిగిన మొదటి సార్వత్రిక ఎన్నికల్లో పార్లమెంట్ సభ్యుడిగా జగ్జీవన్‌రామ్ గెలుపొంది దేశ కార్మిక మంత్రిగా బాధ్యతలు చేపట్టి వెట్టిచాకిరి నుంచి కార్మికులకు విముక్తి కల్పించిన మహనీయుడని కొనియాడారు. పనికాలాన్ని 8గంటలకు కుదించి శ్రమకు తగ్గ వేతనాన్ని కల్పించి అనేక కార్మిక చట్టాలను రూపొందించిన ఘనత బాబు జగ్జీవన్‌రామ్‌కే దక్కిందన్నారు. తపాలశాఖ, వ్యవసాయ శాఖ మంత్రిగా పదవులు చేపట్టి ఊరూరా తపాల కార్యాలయాలను ప్రారంభించి దేశవ్యాప్తంగా విస్తరింపజేసిన ఏకైక వ్యక్తి జగ్జీవన్‌రామ్ అని చెప్పారు. అలాగే ఎఫ్‌సీఐని స్థాపించి సుమారు 30లక్షల మందికి ఉపాధి కల్పించిన మహనీయుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు తాళ్లపల్లి మధుకర్, వెంకటేశ్వర్లు, అశ్వంధామ,ఐలయ్య, భీంరెడ్డి, సంజీవ్, ప్రభుదాస్, చెప్యాల ప్రభాకర్, డేగల సారయ్య, సురేందర్, మాట్ల వెంకటస్వామి, సునీల్, కొలుగూరి రాజు పాల్గొన్నారు.

దళిత ఉద్యమాలకు ఆద్యుడు జగ్జీవన్‌రామ్

దామెర : దళిత ఉద్యమాలకు ఆద్యుడు బాబూ జగ్జీవన్ రామ్ అని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి జిల్లెల్ల మురళి అన్నారు. జగ్జీవన్ రామ్ వర్ధంతిని పురస్కరించుకొని మండలంలోని పులుకుర్తిలో శనివారం ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అణగారిన వర్గాల సంక్షేమానికి కృషిచేసిన మహనీయుడు జగ్జీవన్ రామ్ అని అన్నారు. స్వాతంత్య్ర సమరయోధుడిగా, సంఘ సంస్కర్తగా, తొలి దళిత ఉప ప్రధానిగా దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమని ఆయన సేవలను కొనియాడారు. జగ్జీవన్ రామ్ జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు దండు రాజు, మాజీ సర్పంచ్ గోవిందు అశోక్, ప్యాక్స్ డైరెక్టర్ ఈదునూరి సంతోషస్వామి, ఆదామ్, రాజు, అంకేశ్వరపు నగేష్, డాక్టర్ రాంబాబు, పాముల రమేష్, ముంద్రాతి భిక్షపతి, నవీన్, రాజు, సతీష్, బాబు, మహేష్, లక్ష్మయ్య, విజయవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

యాంటీ రేబిస్ వ్యాక్సిన్ వేయించాలి



కమలాపూర్: శునకానికి టీకా వేస్తున్న మాళవిక



శాయంపేట: పెద్దకోడెపాకలో ..

కమలాపూర్ : పెంపుడు శునకాలు, పిల్లులకు ఏడాదిలో ఒకసారి తప్పనిసరిగా యాంటీ రేబిస్ వ్యాక్సిన్స్ వేయించాలని పశువైద్యాధికారి మాళవిక సూచించారు. జూనోసిస్ డే సందర్భంగా కమలాపూర్, ఉప్పల్, శనిగరం గ్రామాల్లోని పశువైద్య కేంద్రాల్లో శనివారం సుమారు 15 పెంపుడు శునకాలకు యాంటీ రేబిస్ వ్యాక్సిన్ వేశారు. ఈ సందర్భంగా మాళవిక మాట్లాడుతూ.. ఇళ్లల్లో పెంచుకునే పెంపుడు శునకాలు, పిల్లులకు రేబిస్ సోకకుండా నిర్మూలించే టీకాలు వేయించాల్సిందేనన్నారు. రేబిస్ టీకాలు వేసినా కరిస్తే గాయపరిచిన చోట శుభ్రంగా సబ్బు నీళ్లతో కడిగిన తర్వాత చికిత్స చేయించుకోవాలన్నారు. పెంపుడు శునకాలు, పిల్లుల ద్వారా మానవులకు సంక్రమించే వ్యాధులు, వాటి నివారణకు ఇప్పించాల్సిన యాంటీ రేబిస్ వ్యాక్సిన్లపై మండల ప్రజలకు తరచూ అవగాహన కల్పిస్తున్నట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమాల్లో పశు వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

పెంపుడు జంతువులకు రేబిస్ వ్యాక్సిన్స్

శాయంపేట : మండలంలోని పెద్దకోడెపాక గ్రామంలో ప్రపంచ జూనోసిస్ దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో 16 పెంపుడు కుక్కలకు యాంటీ రేబిస్ వ్యాక్సిన్‌లను వేసినట్లు పశువైద్యాధికారి సునీల్ తెలిపారు. శునకాలకు ఉచిత యాంటీ రేబిస్ వ్యాక్సిన్‌లను వేయడం వల్ల వాటి నుంచి మనుషులకు సంక్రమించే వ్యాధుల బారి నుంచి రక్షించుకోవచ్చన్నారు. పశువైద్యశాలలో టీకాలు కూడా అందుబాటులో ఉన్నాయని, కుక్కల యాజమానులు వ్యాక్సిన్లను వేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది రమేష్‌బాబు, పశుమిత్ర రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు ఉద్యోగభద్రత కల్పించాలి



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

పరకాల : ఎస్‌ఎంఆర్, ఔట్ సోర్సింగ్ పద్ధతిపై పనిచేస్తున్న పరకాల మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఐఎన్‌టీయూసీ అనుబంధ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు పుల్లా రమేశ్ డిమాండ్ చేశారు. పారిశుద్ధ్య పనులతో అనారోగ్యం బారిన పడుతున్న సఫాయి కార్మికుడి స్థానంలో వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని కోరారు. మున్సిపాలిటీ కార్మికుల సమస్యలపై ఐఎన్‌టీయూసీ అనుబంధ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో పరకాల మున్సిపల్ కమిషనర్ కె.నర్సింహకు శనివారం వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వ ఉద్యోగులకు వర్తింపచేసే నాల్గోవ తరగతి చివరి మూలవేతనం వర్తింపజేయాలని కోరారు. కార్మికులకు దుస్తులు, చెప్పులు, సబ్బులు అందజేయడంతో పాటు పారిశుద్ధ్య కార్మికుల సమస్యలన్నింటిని పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు పాశం రవి యాదవ్, పరకాల మున్సిపాలిటీ అధ్యక్షుడు బొచ్చు ఐలయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ పశుల సారయ్య, ఉపాధ్యక్షుడు మంద మహేశ్, ప్రధాన కార్యదర్శి కోగిల సుమన్,కోశాధికారి చెరుకు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువుతో అధిక దిగుబడి



రైతులకు అవగాహన కల్పిస్తున్న కల్పన

శాయంపేట : రైతులు తమ పంటల సాగుకు సేంద్రియ ఎరువులను వాడాలని ఫీల్డ్ ఫెసిలిటర్ కుక్కల కల్పన అన్నారు. సేంద్రియ ఎరువులతో తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు పొందవచ్చని కల్పన అన్నారు. మండల కేంద్రంలో శనివారం ప్రజ్వల్ ఎఫ్‌పీసీఎల్, బీసీఐ, హెచ్‌ఎం ప్రాజెక్టు రైతులకు సేంద్రియ ఎరువులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కల్పన మాట్లాడుతూ పంట పొలాల్లో తెగుళ్ల బెడద ఎక్కువగా వ్యాప్తి చెందడంతో పంటలను కాపాడుకునేందుకు వేలకు వేలు రైతులు ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. రైతు స్వయంగా తెగుళ్ల నివారణకు తయారు చేసుకునే ట్రైకోడెర్మావీరడి పట్ల అవగాహన కల్పించారు. పత్తి, మిరప, మొక్కజొన్న పంటల్లో తెగుళ్ల నివారణకు ట్రైకోడెర్మా సూడమోనస్ వంటి కల్చర్లు వాడి భూసారం పెంచుకోవడంతో పాటు తెగుళ్లను సైతం అరికట్టి నాణ్యమైన దిగుబడి పొందాలని సూచించారు. జీవన ఎరువులను ఉపయోగించేలా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రైతులు సిరిమల్లె రమాదేవి, నాలిక భిక్షపతి, శంకర్, అనిల్, అనిత, రాజు, రాజేష్, భారత, రాజమౌళి, రాజేశ్వరి, నర్మద పాల్గొన్నారు.

మొక్కలు నాటి రక్షించాలి



మొక్క నాటుతున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

పరకాల : మొక్కలు నాటడంతో పాటు వాటిని రక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పరకాల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సంతోష్‌కుమార్ అన్నారు. వనమహోత్సవంలో భాగంగా పరకాల ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలల ప్రాంగణంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రిన్సిపాల్ సంతోష్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మానవవాళి మనుగడ చెట్లపైనే ఆధారపడి ఉందన్నారు. మొక్కలు నాటడంతో పాటు వాటి రక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం



దామెర: ఆర్థికసాయం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు



ఐనవోలు: పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మార్నేని రవీందర్‌రావు

దామెర : మండలంలోని పులుకుర్తికి చెందిన ఈదునూరి సునీల్ ఇటీవల మృతిచెందాడు. కాగా అదే గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు శనివారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం రూ.16,000ల నగదును అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గన్ను సరస్వతివెంకటేశ్వర్లు, ఎంపీటీసీ బొల్లం వేణుగోపాల్, ప్యాక్స్ డైరెక్టర్ ఈదునూరి సంతోషస్వామి, నాయకులు ఆదాం, గోవిందు ప్రేమ్‌కుమార్, ముంద్రాతి భిక్షపతి, డాక్టర్ రాంబాబు, పాముల రమేష్ వర్మ, అడువాల రాజు, బొల్లం సూర్యకిరణ్, ముంద్రాతి కిషన్, గోవిందు బుచ్చయ్య, శరత్, గోవిందు సుగుణాకర్, జిల్లెల్ల సాంబయ్య పాల్గొన్నారు.

పరామర్శ

ఐనవోలు : మండలంలోని రెడ్డిపాలెం గ్రామానికి చెందిన తనుగుండ్ల థామస్‌రెడ్డి అనారోగ్యంతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న టిస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు థామస్‌రెడ్డి మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. చైర్మన్ వెంట స్థానిక నాయకులు జోజిరెడ్డి, చందర్ రెడ్డి, రమేష్, రవి, రాజు, సురేష్ రెడ్డి ఉన్నారు.

బియ్యం అందజేత

వేలేరు : మండల కేంద్రానికి చెందిన మోతె పెద్ద రాజయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న భీమ్ యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు మేక రాజు ఆధ్వర్యంలో యూత్ సభ్యులు శనివారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి మృతికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం 50 కేజీల బియ్యం అందజేశారు. కార్యక్రమంలో యూత్ ఉపాధ్యక్షుడు కొడూరి శ్రీకర్, ప్రధాన కార్యదర్శి కొయ్యడ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.